ప్రజాశక్తి
బుధవారం 1 మార్చి 2023
5

అల్లూరి సీతారామరాజు

1.63 లక్షల మందికి
పిఎం కిసాన్, రైతు భరోసా సాయం

ప్రజాశక్తి -పాడేరు : వైఎస్ఆర్ రైతు భరోసా, పిఎం.కిసాన్ పథకం కింద నాలుగో ఏడాది మూడవ విడతలో అల్లూరి జిల్లాలో 1,63,009 మంది రైతులకు రూ.34.09,59,500 లబ్ది చేకూరిందని జిల్లా వ్యవసాయ శాఖ అధికారులు వెల్లడించారు. మంగళవారం స్ధానిక కాఫీ హౌస్లో . వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో పిఎం కిసాన్, .రైతు భరోసా మూడవవిడత నిధుల పంపిణీ నిర్వహించారు. ఝఖ్యమంత్రి .జగన్ మోహన్ రెడ్డి గుంటూరు జిల్లా తెనాలిలో రైతుభరోసా పంపిణీని డిబిటి విధానంలో మీట నొక్కి లబ్ధిదారులైన రైతుల ఖాతాలో జమ చేశారు. ఇక్కడి జిల్లా వ్యవసాయాధికారులు నమూనా చెక్ను రైతులకు అందించారు. కార్యక్రమంలో వ్యవసాయ శాఖ సహాయ సంచాలకులు జి. విజయ కుమార్, ఎం.వి శ్రీనివాస్, ఎం. శ్రీధరరావు తదితరులు పాల్గొన్నారు.

పకడ్బందీగా ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్

పోలింగ్ అధికారుల శిక్షణలో జెసి శివశ్రీనివాస్

పోలింగ్ అధికారుల శిక్షణలో మాట్లాడుతున్న జెసి శివశ్రీనివాస్

ప్రజాశక్తి -పాడేరు,: పట్టభద్ర ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ ప్రక్రియను ప్రశాంత వాతావరణంలో సమర్ధవంతంగా నిర్వహించేందుకు పోలింగ్, సహాయ పోలింగ్ అధికారులకు కృషి చేయాలని జిల్లా జాయింట్ కలెక్టర్ జె.శివశ్రీనివాస్ ఆదేశించారు. మంగళవారం కలక్టరేట్ సమావేశ మందిరంలో పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్పై పిఒ, ఎపిఒలకు మొదటి విడత శిక్షణనిచ్చారు.
ఈ సందర్భంగా జెసి మాట్లాడుతూ ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం ఎలాంటి చిన్న పొరపాట్లకు తావివ్వకుండా పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో అన్ని జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. పోలింగ్ ప్రక్రియలో ఎలాంటి సందేహాలున్నా మాస్టర్ ట్రైనీలను అడిగి నివృతి చేసుకోవాలని సూచించారు. శిక్షణలో అందజేసిన మెటీరియల్పై అధ్యయనం చేసి, అప్పటికీ సందేహాలుంటే రెండో విడత శిక్షణలో నివృతి చేసుకోవా లన్నారు. ఈ సందర్భంగా పోలింగ్కు ముందు పేపర్ సీలుతో బ్యాలెట్ బాక్స్ సీలు చేయటం, పోలింగ్ ముగిసిన తరువాత సీలు చేయటం, టెండర్ ఓటు, చాలెంజ్ ఓటు, బ్యాలెట్ ఎకౌంటు, ప్రిసైడింగ్ అధికారి డైరీ, తదితర అంశాలను జెసి వివరించారు.
ఎన్నికల పోలింగ్ ప్రక్రియను సీరియస్గా తీసుకొని పోలింగ్ ప్రక్రియపై పూర్తి అవగాహన పొంది బాధ్యతాయుతంగా ప్రవర్తించాలని జెసి ఆదేశించారు. ఎన్నికల సంఘం నిర్దేశించిన మార్గదర్శక సూత్రాలను అవగాహన చేసుకోవాలని సూచించారు. పోలింగ్ సందర్భంగా ఎలాంటి ఫిర్యాదులు వచ్చిన సంబంధిత అధికారులపై చర్యలు ఉంటాయనిహెచ్చరించారు. శిక్షణలో డిఆర్ఒ పి.అంబేద్కర్, ప్రత్యేకఉప కలెక్టర్ శర్మ, మాస్టర్ ట్రైనీలు ప్రత్యేక ఉప కలెక్టర్ రమణ, అరకు తహశీల్దార్ వేణుగోపాల్ పాల్గొన్నారు.

పించన్ల పంపిణీ ముసుగులో వైసిపి ఎన్నికల ప్రచారం

ఎన్నికల కమిషన్ నియంత్రించాలి : సిపిఎం జిల్లా కార్యదర్శి అప్పలనర్స

ప్రజాశక్తి -పాడేరు : పింఛన్ల పంపిణీ ముసుగులో అధికార వైసిపి ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారానికి తెరతీస్తోందని, దీనిపై ఎన్నికల కమిషన్ దృష్టి సారించి నియంత్రించాలని సిపిఎం అల్లూరి జిల్లా కార్యదర్శి పి అప్పలనర్స డిమాండ్ చేశారు మంగళవారం విలేకరులతో మాట్లాడుతూ ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో అన్ని ప్రాంతాల్లో ఈ నెల మొదటి వారంలో చేపట్టే పింఛన్ల పంపిణీపై నిఘా పెట్టి, వైసిపి ఎన్నికల ప్రచారాన్ని అడ్డుకోవాలన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమలులో ఉన్నప్పటికీ, పదేపదే అధికార వైసిపి ఎన్నికల నియమావళిని ఉల్లంఘించి, ఓటర్లను ప్రభావితం చేసే చర్యలు కొనసాగిస్తోందన్నారు.
మార్చి మొదటి వారంలో పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో వైసిపిమండల ఇన్ఛార్జిలు, వలంటీర్లు, సచివాలయ కన్వీనర్లు, గృహ సారధులు పాల్గొనాలని వైసిప అధిష్టానం నుంచి ఇప్పటికే ఎమ్మెల్యేలకు ఆదేశాలు వచ్చాయన్నారు. పింఛన్ల పంపిణీలో పార్టీ కేడరంతా పాల్గొని, లబ్ధిదారులతో ఫొటో తీసుకుని జెసిఎస్ జెసియస్ మండల వాట్సాప్ గ్రూపులో పోస్ట్ చేయాలని ఆదేశాలు వచ్చాయన్నారు.
ఎన్నికల కోడ్ను లెక్క చేయకుండా రాష్ట్ర ప్రభుత్వం ఓటర్లను ప్రభావితం చేయడానికి విశ్వప్రయత్నం చేస్తోందని ఇప్పటికే ఎన్నికల సంఘానికి సిపిఎం రాష్ట్ర కమిటీ రెండు లేఖలు రాసిందన్నారు. అయినా ఎటువంటి చర్యలు లేకపోవడంతో వైసిపి యథేచ్ఛగా నిబంధనలను ఉల్లంఘిస్తూ ఎన్నికల ప్రచారం చేస్తోందని ఆరోపించారు. ఇప్పటికైనా ఎలక్షన్ కమిషన్ జోక్యం చేసుకొని ఎన్నికల కోడ్ పటిష్టంగా అమలు జరిగేటట్లు చర్యలు తీసుకోవాలని, అధికార దుర్వినియోగాన్ని అడ్డుకోవాలని, ఎమ్మెల్సీ ఎన్నికలు స్వేచ్ఛగా జరిగేందుకు అవకాశం కల్పించాలని సిపిఎం నేత అప్పలనర్స కోరారు.

పూర్వ విద్యార్థుల ఔదార్యం

నిరుపేద విద్యార్థిని చదువుకు ఆర్థిక సాయం

ప్రిన్సిపల్కు ఫీజు నగదు ఇస్తున్న పూర్వ విద్యార్థులు

పజాశక్తి-పాడేరు టౌన్: అల్లూరి జిల్లా కేంద్రం పాడేరులోని మోదమాంబ హైస్కూల్ చదువుతున్న నిరుపేద విద్యార్థినికి పూర్వ విద్యార్థులు ఆర్థిక సాయం అందజేసి అండగా నిలిచారు. శ్రీ మోదమాంబ హైస్కూల్లో 3వ తరగతి చదువుతున్న విద్యార్థిని కె.లోహితకు రెండేళ్ల స్కూల్ ఫీజును అందజేశారు. మంగళవారం ఫీజు మొత్తాన్ని పాఠశాల ప్రిన్సిపల్ నాగమణిను కలసి నగదును అందించారు. అంతేకాకుండా లోహిత 10వ తరగతి చదువు పూర్తి అయ్యేంతవరకు అయ్యే ఖర్చులకు ఆర్థిక సహాయం అందిస్తామని, బాధ్యతగా చదివిస్తామని ముందుకు వచ్చారు. పాఠశాల పూర్వ విద్యార్థుల ఔదార్యాన్ని పాఠశాల సిబ్బంది అభినందించారు. విద్యార్థిని కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

పబ్లిక్ పరీక్షలంటే భయం పోవాలి

విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ధర్మ

ప్రజాశక్తి-డుంబ్రిగూడ: పదవ తరగతి ఎటువంటి భయం లేకుండా పబ్లిక్ పరీక్షలకు హాజరుకావాలని మానవ హక్కుల నేర నిరోధక సంఘం జిల్లా అధ్యక్షుడు పి ధర్మ సూచించారు. మంగళవారం మండలంలోని నందివలస బాలికల ఆశ్రమ పాఠశాలను సంఘం ఏజెన్సీ మహిళ విభాగం రాష్ట్ర అధ్యక్షురాలు కె కృష్ణకుమారి ఆధ్వర్యంలో సందర్శించారు. పదో తరగతి విద్యార్థులకు పెన్నులు, స్కేలు, బట్టలు పంపిణీ చేశారు. అనంతరం పబ్లిక్ పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులు మానసిక ఒత్తిడికి లేకుండా పరీక్షలకు సన్నద్ధతపై అవగాహన కల్పించారు. సందర్భంగా జిల్లా అధ్యక్షుడు ధర్మ మాట్లాడుతూ పరీక్షలు అంటే ముందుగా ఒత్తిడి, భయం పోవాలని, చదివేటప్పుడు, పరీక్షలు రాసేటప్పుడు ప్రశాంతంగా, ప్రణాళికాబద్ధంగా వ్యవహరిస్తే అందరూ ఉత్తీర్ణులౌతారని భరోసానిచ్చారు. కార్యక్రమంలో సంఘం జిల్లా నాయకులు నాగేశ్వరరావు,ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పారదర్శకంగా సమగ్ర భూ రీసర్వే

సర్వేయర్లు, విఆర్ఒలతో సమీక్షలో పాడేరు సబ్కలెక్టర్ అభిషేక్

మాట్లాడుతున్న సబ్ కలెక్టర్ అభిషేక్

ప్రజాశక్తి -ముంచింగిపుట్టు: మండలంలో సమగ్ర భూ రీసర్వేను పారదర్శకంగా, రాష్ట్ర ప్రభుత్వ నియమ నిబంధనలకు అనుగుణంగా చేపట్టాలని పాడేరు సబ్ కలెక్టర్ అభిషేక్ ఆదేశించారు. మంగళవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో మండలంలో జరుగుతున్న భూరీసర్వేపై సర్వేయర్లు, విఆర్ఒలు, ఇతర రెవెన్యూ సిబ్బందితో సమీక్షించారు.
ఈ సందర్భంగా సబ్కలెక్టర్ మాట్లాడుతూ మార్చి, ఏప్రిల్, మే నెలలో భూ రీసర్వేకు సంబంధించి సర్వేయర్లు, విఆర్ఒలకు లక్ష్యాలను నిర్ధేశించి,వాటిని పూరిత చేయాలని ఆదేశించారు. వివాదాలు, గొడవలున్న భూములను పక్కన బెట్టేయకుండా, పకడ్బందీగా సర్వే చేయాలని సూచించారు. భూరీసర్వేలో నిర్లక్ష్యం చేసినా, లక్ష్యసాధనలో విఫలమైనా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఇప్పటివరకు చేపట్టిన భూరీసర్వే వివరాలు, ఆ సందర్భంగా వారికి ఎదురైన ఇబ్బందులు, ఇతర అనుభవాలను అడిగి తెలుసుకున్నారు ముఖ్యంగా ఏ గ్రామానికి ఏ రోజు భూసర్వే కోసం వెళుతున్నారో ఆ గ్రామ ప్రజలకు ముందుగానే కచ్చితంగా సమాచారం అందించాలని, భూ యజమాని సమక్షంలోనే సర్వే చేయాలని సూచించారు. సర్వేలో ఎటువంటి అవకతవకలకు ఆస్కారం లేకుండా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. కార్యక్రమంలో తహశీల్దార్ నర్సమ్మ, ఎస్ నాగేశ్వరరావు, వెంకటరావు, వి రవి కుమార్, ఎం మోహనరావు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ప్రభుత్వ ఉపాధ్యాయిని దుర్మరణం

జీపు బోల్తా ఘటనలో జయలక్ష్మి మృత్యువాత

ప్రమాదస్థలిలో జయలక్ష్మి మృతదేహం, ఇన్సెట్లో ఫైల్ ఫొటో

ప్రజాశక్తి- పాడేరు/ పెదయబలు : మండలంలోని చింతల వీధి జంక్షన్ సమీపంలో మంగళవారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో ప్రభుత్వ ఉపాధ్యాయిని వాలంగి, జయలక్ష్మి(34) దుర్మరణం చెందారు. పెదబయలు మండలంలోని ముసిడి పుట్టు గ్రామంలోని మండల పరిషత్తు ప్రాథమిక పాఠశాలలో టీచర్ గా పని చేస్తున్న జయలక్ష్మి తన విధులు ముగించుకొని తిరిగి పాడేరులో తన నివాస గృహానికి వస్తుండగా, ఈమె ప్రయాణిస్తున్న జీపు బోల్తా పడింది. పక్క దారి నుంచి బొలెరో వాహనం అడ్డంగా రావడంతో జీపు సడన్ బ్రేక్ వేసేసరికి బోల్తా పడింది. జీపులో చివర కూర్చున్న జయలక్ష్మి అదుపుతప్పి రోడ్డుపై జారిపడిపోయింది . ఆమె పైన జీపు పడిపోవడంతో తలకు బలమైన గాయాలు తగిలి అక్కడికక్కడే జయలక్ష్మి మృతి చెందింది. ఈమె స్వస్థలం పెదబయలు మండలం గుల్లేలు గ్రామం, కాగా ప్రస్తుతం పాడేరు లోని సిల్వర్ నగర్ లో నివాసం ఉంటున్నారు. ఈమె భర్త హనుమంతరావు విశాఖపట్నం రైల్వేలో ఉద్యోగం చేస్తున్నారు ఈమెకు ఇద్దరు కుమారులు ఉన్నారు. రోడ్డు ప్రమాదంలో జయలక్ష్మి దుర్మరణం చెందడంపై ఉపాధ్యాయ సంఘాలు సంతాపం వ్యక్తం చేశాయి. ప్రమాదానికి గురైన ఈ జీపులో ప్రయాణిస్తున్న మరికొందరు స్వల్ప గాయాలతో సురక్షితంగా బయటపడ్డారు ఈ ప్రమాద ఘటనపై పాడేరు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు

మండల పరిషత్తు సమావేశం రసాభాస

- ★ ఎంపిడిఒ, జీడిగుప్ప వైద్యాధికారి తీరుపై సిపిఎం ప్రజాప్రతినిధుల మండిపాటు
- ★ తాగునీటి సమస్యపై నిలదీత

మాట్లాడుతున్న ఎంపిపి కారం లక్ష్మి

అధికారుల తీరును నిలదీస్తున్న సిపిఎం ప్రజాప్రతినిధులు

ప్రజాశక్తి-విఆర్.పురం
విఆర్.పురం మండల పరిషత్తు సమావేశ మందిరంలో మంగళవారం ఎంపిపి కారం లక్ష్మి అధ్యతన జరిగిన మండల సర్వసభ్య సమావేశం రసాభాసగా మారింది. ఎంపిడిఒ ఆర్.ఫణీంద్ర శాఖల వారీగా సమీక్ష ప్రారంభించారు. ఈ సమయంలో ఇటీవల ములకనపల్లిలో జరిగిన ప్రభుత్వ కార్యక్రమం సందర్భంగా ఎంపిపిని, స్థానిక ప్రజాప్రతినిధులను ఎంపిడిఒ అవమానపర్చే విధంగా వ్యవహరించిన తీరుపై శ్రీరామగిరి సర్పంచ్ పులి సంతోష్ కుమార్ నిలదీశారు. ప్రభుత్వ కార్యక్రమాన్ని వైసిపి కార్యక్రమంలా ఎందుకు నిర్వహించారని ప్రశ్నించారు. వైసిపి నాయకుల వేదికలా నిర్వహించి ఇష్టానుసారంగా వ్యవహరించిన తీరు సరికాదని మండిపడ్డారు. దీనిపై ఎంపిడిఒ వివరణ ఇవ్వాలని సభ్యులు పట్టుబట్టారు. అనంతరం కుందులూరులో తాగునీటి సమస్యపై ప్రజా ప్రతినిధులు గట్టిగా లేవనెత్తారు. నెలల తరబడి అక్కడ తాగునీరు అందించకపోవడంతో అక్కడి ప్రజలు తీవ్ర ఇబ్బంది పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

జీడిగుప్ప వైద్యాధికారి తీరుపై...

మండల పరిషత్తు సమావేశంలో జీడిగుప్ప వైద్యాధికారి మాట్లాడిన తీరుపై సిపిఎం సభ్యులు మండిపడ్డారు. సమావేశంలో జీడిగుప్ప వైద్యాధికారి మాట్లాడుతూ తమకు ఎటువంటి సమాచారం ఇవ్వకుండా ఆసుపత్రి సందర్శనకు ఎందుకు వచ్చారని ప్రశ్నించారు. దీనిపై సిపిఎం సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు. రోగులకు అందుతున్న వైద్యం గురించి తెలుసుకునేందుకు మండల పరిషత్తు అధ్యక్షులు ఆసుపత్రిని సందర్శించడం తప్పా అని వైద్యాధికారిని ప్రశ్నించారు. ఇప్పటికైనా వినయంతో మాట్లాడాలని, ఎంపిపిపై ఇలా మాట్లాడటం ఎంత వరకు సమంజసం మండిపడ్డారు. ఈ దశలో అరగంట పాటు సమావేశం రసాభాసగా మారింది.
అనంతరం ఎంపిపి కారం లక్ష్మి మాట్లాడుతూ మండల పరిషత్తు సమావేశంలో అధికారుల సమీక్షలు ప్రజలకు జవాబుదారీగా లేవని ఆక్షేపించారు. ఈ సమావేశంలో జీడిగుప్ప వైద్యాధికారి మాట్లాడిన తీరు ఆశ్చర్యపరిచిందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజా ప్రతినిధులతో కలిసి సమన్వయంతో పని చేయాల్సిన బాధ్యత ఉన్న అధికారులు దానిని విస్మరిస్తున్నారని విమర్శించారు. పోలవరం ప్యాకేజీ, పునరావాసంపై తహశీల్దారు శ్రీధర్ మాట్లాడారు. విద్యుత్, ఫారెస్ట్, వెలుగు, విద్య, గృహ నిర్మాణం, వైద్య ఆరోగ్యం, వ్యవసాయం, శిశు సంక్షేమం, ఆర్డబ్ల్యుఎస్, పిఆర్ తదితర శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశంలో జెడ్పిటిసి వాళ్ళ రంగారెడ్డి, సర్పంచ్లు మారాయ్య, వెట్టి లక్ష్మి, పూనెం సరోజిని, అందెల సీతారాం రెడ్డి, ఎంపిటిసిలు వాళ్ళ వెంకటేశ్వరరెడ్డి, పూనెం ప్రదీప్ కుమార్, కారం భుచ్చమ్మ, ఎంఈఒ లక్ష్మీనారాయణ, విద్యుత్ శాఖ జెఇ పరశు రాముడు, ఎఒ రఘుకుమార్, అన్ని పంచాయితీల కార్యదర్శులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఆరు ఎకరాల జీడి తోట దగ్ధం

ప్రజాశక్తి-కొయ్యూరు
మండలంలోని మర్రివాడ పంచాయతీ శివారు విడుతమాడు గ్రామంలోని పాసిలి చిట్టిబాబుకు చెందిన ఆరు ఎకరాల జీడి మామిడి తోట మంగళవారం దగ్ధమైంది. పంట చేతికొచ్చే సమయంలో తోట దగ్ధం అవడంతో కుటుంబం రోడ్డున పడిందని బాధిత రైతు చిట్టిబాబు వాపోతున్నారు. అప్పులు చేసి దుక్కు చేసి, ఎరువులు వేశానని, తోట కాలిపోవడంతో అప్పులు తీర్చే అవకాశం లేకుండా పోయిందని, తమను ప్రభుత్వం ఆదుకోవాలని చిట్టిబాబు కుటుంబం కోరింది.

అగ్ని ప్రమాదంలో కాలిపోయి జీడితోట

జీడి రైతులకు నష్ట పరిహారం చెల్లించాలని వినతి

ప్రజాశక్తి-రాజవొమ్మంగి
మండలంలోని కొత్తకింద్ర, ధమనపాలెం గ్రామాలలో సోమవారం రాత్రి జరిగిన అగ్ని ప్రమాదంలో జీడి మామిడి తోటలు దగ్ధం కావడంతో తీవ్రంగా నష్టపోయిన రైతులను ప్రభుత్వం అన్ని విధాల ఆదుకోవాలని తహశీల్దారు సుబ్రహ్మణ్యఆచారికి బాధితులు మంగళవారం వినతిపత్రం అందజేశారు. ఆయా గ్రామాల్లో ఎనిమిది మందికి చెందిన 20 ఎకరాల జీడి మామిడి తోటలకు నష్టం వాటిల్లిందని పేర్కొన్నారు. అగ్ని ప్రమాదం వల్ల పూత, పింజ మాడిపోయిందని, పంట చేతికొచ్చే దశలో నష్టం జరిగిందని, దీంతో లక్షల రూపాయలు నష్టపోయామని బాధితులు తెలిపారు. దీనికి స్పందించిన తహశీల్దారు ఈ విషయాన్ని పైఅధికారులకు తెలియజేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో రైతులు వనపల కృష్ణవేణి, సత్యవతి, లీలావతి, యాదల సత్తిబాబు, పెంటయ్య తదితరులు పాల్గొన్నారు.

తహశీల్దారుకు వినతిపత్రం ఇస్తున్న బాధిత రైతులు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి

పార్టీ విజయానికి కృషి చేయాలి

- ఎమ్మెల్యే ధనలక్ష్మి

ప్రజాశక్తి -మారేడుమిల్లి
సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు వచ్చే ఎన్నికల్లో వైసిపి విజయానికి కృషి చేయాలని రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి అన్నారు. స్థానిక గిరిజన వర్తక కేంద్రం వద్ద మంగళవారం మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమంలో భాగంగా మండల సచివాలయ కన్వీనర్లు, గృహసారథులతో ఆమె సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గహసారథులు, కన్వీనర్లు, వాలంటీర్లు తమ పరిధిలోని ప్రతి ఇంటికి వెళ్లి ప్రభుత్వ పథకాల గురించి తెలియజేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ సార్ల లలిత కుమారి, జెడ్పీటీసీ సభ్యుడు గొర్రె బాలాజీ బాబు, వైస్ ఎంపీపీలు లక్కోండ రవికుమార్, తమ్ముడు లత, మండల కో ఆప్షన్ సభ్యుడు గురుకు ధర్మరాజు, సర్పంచ్ కొండా జాకబ్, వైస్ సర్పంచ్ వీరబాబు, పార్టీ మండల కన్వీనర్ సత్తి సత్యనారాయణ రెడ్డి, మండల కార్యదర్శి గంగరాజు, యూత్ అధ్యక్షులు గొర్లెట అనిల్ ప్రసాద్ (బాబీ) పాల్గొన్నారు.

సీలేరులో డెంగీ కలకలం

- కెజిహెచ్లో చికిత్స పొందుతున్న బాలిక

ప్రజాశక్తి -సీలేరు
జికె.వీధి మండలం సీలేరు పంచాయతీ పరిధి చింతపల్లి క్యాంపులో డెంగీ కేసు నమోదు కావడం తీవ్ర కలకలం రేపింది. స్థానిక పిహెచ్సి వైద్య అధికారి కె.సౌమ్య కథనం ప్రకారం... చింతపల్లి క్యాంపు గ్రామానికి చెందిన పదేళ్ల బాలిక కిలో పార్వతి తీవ్ర జ్వరంతో బాధపడుతుండగా, ఈనెల 22న ఆమె తల్లిదండ్రులు స్థానిక పిహెచ్సికి తీసుకొచ్చారు. పార్వతికి ప్రథమ చికిత్సలో భాగంగా మలేరియా టెస్టు నిర్వహించగా నెగిటివ్ వచ్చింది. సిబ్బీసి టెస్టులు పిహెచ్సిలో అందుబాటులో లేకపోవడంతో పక్కనే ఉన్న ఏపీ జెన్కో ఆసుపత్రిలో చేర్పించారు. అక్కడ పరీక్ష చేయగా ప్లేట్లెట్స్ 38,000కు పడిపోయినట్లు నిర్ధారణ అయింది. పార్వతి ఆరోగ్య పరిస్థితి ఆందోళనకరంగా ఉండడంతో మెరుగైన వైద్య సేవ నిమిత్తం చింతపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి అంబులెన్స్లో తరలించేందుకు సన్నాహాలు చేశారు. అక్కడి వెళ్లేందుకు పార్వతి తండ్రి శ్రీను, తల్లి నిరాకరించారు. దీంతో వారి కుమార్తె ఆరోగ్య పరిస్థితిపై కౌన్సిలింగ్ చేసి నచ్చజెప్పి చింతపల్లి ప్రభుత్వాసుపత్రికి పార్వతిని తరలించారు. వైద్య సేవలు అందించినా ఆమె ఆరోగ్య పరిస్థితి మెరుగు పడలేదు. వెంటనే అక్కడి వైద్యులు పార్వతిని విశాఖ కెజిహెచ్కు అంబులెన్స్లో తరలించారు. అక్కడ వైద్య పరీక్షలు నిర్వహించగా, డెంగీ అని నిర్ధారణ అయింది. ప్రస్తుతం పార్వతి కెజిహెచ్లో చికిత్స పొందుతోంది. ఈ నేపథ్యంలో డెంగీ వ్యాధి పట్ల ప్రజల అప్రమత్తంగా ఉండే విధంగా అవగాహన కార్యక్రమాలను చేపడతామని వైద్యాధికారి సౌమ్య తెలిపారు.

కెజిహెచ్లో చికిత్స పొందుతున్న పార్వతి

చట్టసభల్లో ప్రజల గొంతు వినిపిస్తా

విస్తృతంగా పిడిఎఫ్ అభ్యర్థి కోరెడ్ల రమాప్రభ ప్రచారం

ప్రజాశక్తి-విజయనగరం టౌన్, గజపతినగరం

ఉద్యోగుల, ఉపాధ్యాయుల, నిరుద్యోగుల, పెన్షనర్ల సమస్యలను, బాధలను నేడు వినేవారే కరువయ్యారని, ఇలాంటి పరిస్థితుల్లో చట్ట సభల్లో అందరి గొంతుగా మన వాణి వినిపించాల్సిన అవసరం ఉందని ఉత్తరాంధ్ర పట్టభద్రుల నియోజకవర్గం పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి డాక్టర్ కోరెడ్ల రమాప్రభ అన్నారు. చట్ట సభల్లో ప్రశ్నించి, డిమాండ్లను సాధించుకునేందుకు పిడిఎఫ్ అభ్యర్థిగా తనను గెలిపించాలని ఓటర్లను కోరారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా మంగళవారం నగరంలోని విజ్జీ స్టేడియం, రాజీవ్‌గాంధీ స్టేడియంలో వాకర్స్‌ను, ఎస్ఐ, కానిస్టేబుల్ ఉద్యోగాలకు శిక్షణ పొందుతున్న నిరుద్యోగులను కలిసి పిడిఎఫ్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న తనకు ఓటు వేసి గెలిపించాలని కోరారు. అనంతరం పలు విద్యా సంస్థలు, ప్రభుత్వ కార్యాలయాల్లో పట్టభద్రుల ఓటర్లను కలుస్తూ, నిరుద్యోగ యువతతో ర్యాలీ అవుతూ సమస్యలు తెలుసుకుని కాసేపు ముచ్చటించారు. అందర్నీ పలకరిస్తూ మద్దతు తెలపాలని కోరారు. నేడు ఉద్యోగుల సమస్యలు సిపిఎస్ రద్దు, ప్రభుత్వ రంగ సంస్థలను కాపాడుకోవడం మన ప్రథమ కర్తవ్యమని అన్నారు. ఏటా జాబ్ క్యాలెండర్ విడుదల చేస్తామని చెప్పి నిరుద్యోగులను మభ్య పెట్టారని అన్నారు. ప్రచారంలో యువత, ఉద్యోగుల నుంచి విశేష ఆదరణ లభించింది. కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు కె.సురేష్, వెంకటేష్, రామ్మోహన్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు, అధ్యాపకులకు భద్రత ఏదీ?

ప్రైవేటు విద్యాసంస్థల్లో పనిచేస్తున్న అధ్యాపకులకు, ఉపాధ్యాయులకు ప్రభుత్వం భద్రత కల్పించాలని రమాప్రభ అన్నారు. గజపతినగరంలో ఆమె విస్తృత ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా పలు ప్రైవేటు పాఠశాలలు, కళాశాలల్లో పర్యటించి అధ్యాపకులను, యాజమాన్యాలను కలుసుకున్నారు ప్రైవేటు విద్యాసంస్థల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు, అధ్యాపకులకు ప్రభుత్వం గుర్తింపు కార్డులు ఇవ్వాలని, హెల్త్‌కార్డులు మంజూరు చేయాలని, సంక్షేమబోర్డు, సహాయ నిధిని ఏర్పాటు చేయాలని కోరారు. వారి కోసం ప్రత్యేక చట్టం చేయాలని డిమాండ్ చేశారు. వీటన్నింటినీ నెరవేర్చుకోవాలంటే శాసనమండలిలో మన గొంతు వినిపించేందుకు పిడిఎఫ్ అభ్యర్థిని గెలిపించాలని కోరారు. ఆమె వెంట ప్రజాసంఘాల నాయకులు జి. శ్రీనివాస్, వి.లక్ష్మి, డి.రాము, ఎస్.బంగారునాయుడు, ఎన్.నాయుడు పాల్గొన్నారు.

విజయనగరం జిల్లాలో ప్రచారం చేస్తున్న పిడిఎఫ్ అభ్యర్థి రమాప్రభ

ఆరిలోవ : నిత్యం ప్రజా సమస్యలపై పోరాడుతూ, ప్రజాగొంతును వినిపించే ఉత్తరాంధ్ర పట్టభద్రుల పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి కోరెడ్ల రమాప్రభకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని సిపిఎం ఆరిలోవ జోన్ కమిటీ ఆధ్వర్యాన 13వ వార్డు పరిధి ఆరిలోవ కాలనీలో ప్రచారం నిర్వహించారు. పట్టభద్రుల ఓటర్ల వద్దకు వెళ్లి కరపత్రాలు అందించి, రమా ప్రభకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు పి.శంకరరావు, ఎఐటియుసి నాయకులు రమణ, కాసు నాయుడు, రాగోలు గణపతి తదితరులు పాల్గొన్నారు.

గాజువాక : ఉత్తరాంధ్ర పట్టభద్రుల పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి కోరెడ్ల రమాప్రభకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని జివిఎంసి కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ కార్యదర్శి గొలగాని అప్పారావు పిలుపునిచ్చారు. జివిఎంసి 86వ వార్డు పరిధి రాజీవ్‌నగర్ ఏరియా కార్మికులతో మంగళవారం జనరల్ బాడీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మన కుటుంబీకుల్లో డిగ్రీ చదివి ఎమ్మెల్సీ ఓటర్‌గా నమోదు చేసుకున్న వారు ఉంటే డాక్టర్ కోరెడ్ల రమాప్రభకి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని చెప్పాలని కోరారు. మన భవిష్యత్తును ఈ ఓటు మారుస్తుందన్నారు. ఈ సమావేశంలో యూనియన్ వర్కింగ్ ప్రెసిడెంట్ ఎస్.గణేష్, రాజారావు, సూర్యకాంతం, నూకరాజు, శ్రీను, పాల్గొన్నారు.

ఎఐటియుసి ఆధ్వర్యాన..

ఎంవిపి.కాలనీ : పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి డాక్టర్ కోరెడ్ల రమాప్రభకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరుతూ ఎఐటియుసి ఆధ్వర్యంలో మంగళవారం ఎంవిపి సెక్టార్ -1లో ప్రచారం నిర్వహించారు. సంఘం రాష్ట్ర వర్కింగ్ కమిటీ సభ్యులు జి.వామనమూర్తి మాట్లాడుతూ చట్టసభల్లో ఉత్తరాంధ్ర గొంతు వినిపించేందుకు రమాప్రభను గెలిపించాల్సిన అవసరముందన్నారు. కార్యక్రమంలో సిపిఐ నాయకులు రవికృష్ణ, ఆటో సంఘం నాయకులు బుల్లిబాబు పాల్గొన్నారు.

పిడిఎఫ్ అభ్యర్థి రమాప్రభకు మాతృభాషా వాలంటీర్ల మద్దతు

జి.మాడుగుల : ఉత్తరాంధ్ర పట్టభద్రుల పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి డాక్టర్ కోరెడ్ల రమాప్రభను గెలిపించాలని మాతృభాష వాలంటీర్ల సంఘం జిల్లా కార్యదర్శి కొర్ర సర్భునాయుడు, గిరిజన సంఘం జిల్లా ఉపాధ్యక్షులు సాగిన ధర్మన్న పడాల్ కోరారు. మండలంలోని పట్టభద్రుల ఓటర్లను కలిసి ప్రచారం చేశారు. అలాగే మాతృభాషా వాలంటీర్ల సంఘం సమావేశంలో పాల్గొని, మాట్లాడుతూ, ఏటా భాషావాలంటీర్ల రెన్యువల్, కనీస వేతనం అమలు, ఇతర సమస్యల పరిష్కారానికి భాషా వాలంటీర్ల తరపున శాసనమండలిలో గళం వినిపించడానికి, ప్రభుత్వం, అధికారులతో పోరాడడానికి కోరెడ్ల రమాప్రభను గెలిపించాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. ఈ సందర్భంగా మాతృభాషా వాలంటీర్లు పిడిఎఫ్ అభ్యర్థి రమాప్రభకు తమ మద్దతు ప్రకటించారు. కార్యక్రమంలో మాతృభాష వాలంటీర్ల సంఘం మండల అధ్యక్షురాలు ఎస్.చిన్నమ్మి మండల కార్యదర్శి పి.కేశవరావు కోశాధికారి పి.కృష్ణకుమార్ నాయకులు అప్పలరాజు, చిన్నబ్బాయి పాల్గొన్నారు

ప్రజాసంఘాల విస్తృత ప్రచారం

అనంతగిరి : ప్రజాసంఘాలు బలపరిచిన పిడిఎఫ్ అభ్యర్థి డాక్టర్ కోరెడ్ల రమాప్రభను గెలిపించాలని కోరుతూ మంగళవారం గిరిజన సంఘం ఆధ్వర్యన జెడ్‌పిటిసి దీసరి గంగరాజు విస్తృతంగా ప్రచారం చేశారు. పలు పాఠశాలలు, కార్యాలయాల్లోని పట్టభద్రుల ఓటర్లను కలిసి, కరపత్రాలను అందజేసి, ప్రజాసమస్యలపై నిరంతరం పోరాడే డాక్టర్ కోరెడ్ల రమాప్రభను ప్రథమ ప్రాధాన్యత ఓటేసి గెలిపించాలని అభ్యర్థించారు.కార్యక్రమంలో గిరిజన సంఘం మండల నాయకులు ఎస్. నాగులు, జె. సుబ్బారావు, జె.రామన్న పాల్గొన్నారు

రాంబిల్లి : ప్రజా సంఘాలు బలపరచిన పిడిఎఫ్ అభ్యర్థి కోరెడ్ల రమాప్రభకు మొదటి ప్రాధాన్యత ఓటును గెలిపించాలని స్థానిక ప్రజా సంఘాల నేతలు ఓటర్లను అభ్యర్థించారు. మంగళవారం వారు మండలంలోని నేవీకాలనీ, కొప్పుగొండుపాలెం, చినకలవలాపల్లి, కొత్తపేట, కొండవారపాలెం గ్రామాల్లో పట్టభద్రుల ఓటర్ల ఇళ్లకు వెళ్లి కోరెడ్ల రమాప్రభకు ఓటు వేయాలని అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు జి.దేముడునాయుడు, డివైఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు ఎన్.నారాయణరావు, సిహెచ్ శివాజీ, మత్స్యకార్మిక సంఘం జిల్లా కార్యదర్శి చోడిపిల్లి గంగరాజు, డివైఎఫ్ఐ నాయకుడు సిహెచ్ నూకన్న, సిఐటియు నాయకులు సమ్మెట వర్మ పాల్గొన్నారు.

అనంతగిరిలో మాట్లాడుతున్న జెడ్‌పిటిసి సభ్యులు గంగరాజు

జి.మాడుగుల మండలంలో కరపత్రాలు పంపిణీ

రాజీవ్‌నగర్ ప్రాంతంలో మున్సిపల్ కార్మికులు

రాంబిల్లి మండలంలో ప్రచారం నిర్వహిస్తున్న ప్రజా సంఘాల నాయకులు



ఆధార్ అప్‌డేషన్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న జెసి

ఆధార్ అనుసంధాన జనన నమోదులు జరగాలి : జెసి

ప్రజాశక్తి -పాడేరు: జిల్లాలో ఆధార్ ఆధారిత జనన నమోదులు జరగాలని, తద్వారా అందరికీ ఆదార్ కల్పించే వీలుంటుందని జిల్లా జాయింట్ కలెక్టర్ జె.శివ శ్రీనివాసు ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ మినీ సమావేశ మందిరంలో జిల్లా స్థాయి ఆధార్ పర్యవేక్షక కమిటీ సమావేశంలో మాట్లాడుతూ జిల్లాలోని కొన్ని మారుమూల గిరి శిఖర గ్రామాలలో అనేక మందికి ఆధార్ లేనందున వారికి ఆధార్ నమోదుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. అదేవిధంగా ప్రతి ఆధార్ కార్డుదారుడు తమ మొబైల్ నంబరును ఆధార్‌తో లింక్ చేసుకోవాలని సూచించారు. ఉడాయ్ ప్రతినిధి గిరిధర్ మాట్లాడుతూ, ఏజెన్సీలో ప్రతి నెలా సగటున రెండు వేల జననాలు జరుగుతున్నప్పటికీ ఆదార్ ఆధారిత రిజిస్ట్రేషన్లు అతి తక్కువగా ఉన్నాయన్నారు. ప్రసవ సమయంలో సంబంధిత డాక్టర్లు, పారా మెడికల్ సిబ్బంది ప్రత్యేక శ్రద్ధ తీసుకొని ఆధార్ లింక్‌తో జనన రిజిస్ట్రేషన్లు చేయిన్చాలన్నారు. ఐదేళ్లలోపు పిల్లలలకు జనన ధ్రువీకరణ తీసుకుని, తల్లి లేదా తండ్రి తన బిడ్డకు ఆధార్ చేయించాలని, బిడ్డ వేలి ముద్రలు, ఫోటో, ఐరిష్, అవసరం లేదని వివరించారు.

ఆధార్ నెంబర్లు, నకళ్లను ఎవరికీ ఇవ్వొద్దు

అధార్ నంబర్లతో అనేక మోసాలు జరుగుతున్నందున కోర్టు ఉత్తర్వుల మేరకు ఆధార్ ప్రతులు ఎవ్వరూ అడగకూడదని, ఎవ్వరూ ఇవ్వకూడదని సూచించారు. తప్పని సరి పరిస్థితులలో ఇవ్వాల్సి వస్తే మాస్క్ ఆధార్ మాత్రమే ఇవ్వాలన్నారు. ఆధార్ నమోదై పదేళ్లు పూర్తయితే వారంతా తప్పనిసరిగా అప్‌డేట్ చేయించుకోవాలని సూచించారు.

కొన్ని సచివాలయాలలో కొన్ని పథకాలకు ఆధార్ ఎక్సెప్షనల్ విధానంలో ఇస్తున్నట్లు ఉడాయ్ గుర్తించిందని, వాటిపై సమగ్ర పరిశీలన చేయాల్సి ఉందని సూచించారు.. జిల్లాలో 6,82,172మంది ఆధార్ కార్డుదారులు డాక్యుమెంట్లను అప్‌లోడ్ చేయకుండా పెండింగ్‌లో ఉన్నాయన్నారు. ఆధార్‌కు సంబంధించి అనేక విధాలుగా విస్తృత ప్రచారం చేస్తున్నప్పటికీ అనేక మందికి ఆధార్ లేకపోవడ సరికాదన్నారు. జిల్లా యంత్రాంగం ప్రత్యేక డ్రైవ్ చేపట్టి ఆధార్ నమోదు చేయించాలని సూచించారు. ఎక్కడైనా కొత్త నమోదు కేంద్రాలు ఏర్పాటు లేదా తొలగింపు ప్రతిపాదనలు పంపిస్తే పరిశీలించి చర్యలు చేపడతామని ఉడాయ్ ప్రతినిధి వెల్లడించారు. ఈ సందర్భంగా ఆధార్ అప్‌డేట్ పోస్టర్లను జెసి ఆవిష్కరించారు.కార్యక్రమంలో డిఆర్ఓ పి.అంబేద్కర్, ఎల్‌డిఎం ఎన్.రవితేజ, సిడిపిఓ ఝాన్సీ, ఈ.గవర్నెన్స్ జిల్లా కోఆర్డినేటర్ సంతోష్ కుమార్, జిఎస్‌డబ్ల్యుఎస్ జిల్లా కోఆర్డినేటర్ కె.సునీల్ కుమార్, సిపిఓ ఎస్ఎస్ఆర్‌కె.పట్నాయక్ పాల్గొన్నారు.

మహిళలకు టైలరింగ్ శిక్షణ సర్టిఫికెట్లు

ప్రజాశక్తి -హుకుంపేట: అప్ హోల్డ్ స్వచ్ఛంద సేవాసంస్థ ఆధ్వర్యంలో ఆడారిమెట్టలో ఎత్ని ట్రైనింగ్ సెంటర్‌లో ఐదో బ్యాచ్‌గా టైలరింగ్ శిక్షణ పొందిన మహిళలకు మంగళవారం సర్టిఫికెట్లను అందజేశారు. సంస్థ చైర్మన్ ఎ.ఫిలిఫ్ తిమోతి ఆధ్వర్యంలో మహిళలకు ఉచిత టైలరింగ్ శిక్షణనిచ్చారు. శిక్షణ పొందిన అభ్యర్థులు తమ కుటుంబజీవనోపాధికి దోహదపడాలని సూచించారు. సంస్థ సిబ్బంది పాల్గొన్నారు.

క్రిస్టియన్ మైనారిటీ అధ్యక్షుడికి సన్మానం

ప్రజాశక్తి- అరకు లోయ: వైసిపి క్రిస్టియన్ మైనారిటీల అల్లూరి జిల్లా అధ్యక్షుడిగా నియమితులైన కేతుర ఫౌండేషన్ వ్యవస్థాపకుడు డాక్టర్ బిషప్ విజయ్ డానిల్ మోడీని అరకులోయ పున్నమి అతిథి గృహంలో అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ, నియోజకవర్గంలోని వైసీపీ నాయకులు, వివిధ క్రైస్తవ సంఘాల పాస్టర్లు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పాల్గుణ మాట్లాడుతూ, క్రైస్తవ సమాజానికి మేలుచేసేందుకు సిఎం జగన్ క్రిస్టియన్ మైనారిటీల కార్పొరేషన్ ఏర్పాటు చేసి అధ్యక్ష పదవులు ఇచ్చారన్నారు. క్రిస్టియన్ మైనారిటీల అల్లూరి జిల్లా అధ్యక్షుడు డాక్టర్ విజయ్ డానియల్ మోడీ మాట్లాడుతూ, తనకు అప్పగించిన బాధ్యతలను అంకితభావంతో నిర్వహిస్తానన్నారు. ఇదే వేదికలో ఎమ్మెల్యే ఫాల్గుణ పుట్టినరోజు వేడుకను జరుపుకుని కేక్ కట్ చేశారు.

విద్యార్థులు ఏ విధంగా చదువుతున్నారో పరిశీలిస్తున్న అధికారులు

ఉన్నత శిఖరాలను అధిరోహించాలి

ప్రజాశక్తి-రాజవొమ్మంగి : విద్యార్థులు బాగా చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని స్థానిక ఎంపీడీవో కె బాపన్నదొర, ఎంఈఓ కె తాతబ్బాయి దొర అన్నారు. మంగళవారం స్థానిక గురుకుల పాఠశాలను వారు ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. విద్యార్థులు ఏ విధంగా చదువుతున్నది, పాఠశాలలో సౌకర్యాలు, మెనూ ఏ విధంగా అందుతున్నది, విద్యా బోధన తీరు తదితర అంశాలపై ఆరా తీశారు. ఇటీవల ప్రభుత్వం విద్యార్థులకు అందజేసిన ట్యాబ్లో క్లాసులు ఏ విధంగా ఫాలో అవుతున్నది అధికారులు పరిశీలించారు. పదవ తరగతి పబ్లిక్ పరీక్షలు దగ్గర అవుతున్న నేపథ్యంలో విద్యార్థులు బాగా చదివి, పరీక్షలు బాగా రాసి మంచి మార్కులు తెచ్చుకోవాలని సూచించారు. విద్యార్థుల ఆరోగ్య స్థితిగతులను స్థానిక పిహెచ్‌సి సబ్ యూనిట్ అధికారి సిహెచ్ ప్రసాద్ అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్ సత్యవేణి, సచివాలయ సిబ్బంది, పిహెచ్‌సి సిబ్బంది, పాఠశాల ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

వాహనాలను తనిఖీ చేస్తున్న పోలీసులు

వాహనాల తనిఖీ

ప్రజాశక్తి-రంపచోడవరం : రంపచోడవరం పోలీసు స్టేషన్ ఎదురుగా ఎస్ఐ మోహన్‌కుమార్ మంగళవారం సాయంత్రం వాహన తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా ఎస్ఇ మాట్లాడుతూ వాహనదారులు రికార్డులను కలిగి ఉండాలని, మద్యం సేవించి వాహనాలు నడపరాదని తెలిపారు. నిబంధనలు పాటించకుంటే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

తుది ఉత్తర్వులకు లోబడి ఉండాలి

ప్రజాశక్తి-అమరావతి : విశాఖ జిల్లా యండాడ గ్రామంలో హయగ్రీవ ఫార్మ్స్ అండ్ డెవలపర్స్ చేస్తున్న నిర్మాణాలను నిలిపివేయాలని జివిఎంసి కమిషనరు ఇచ్చిన ఉత్తర్వుల అమలును నిలిపివేస్తూ హైకోర్టు స్టే విధించింది. అయితే కమిషనరు జారీ చేసే తుది ఉత్తర్వులకు లోబడి ఆ సంస్థ నిర్మాణాలు ఉంటాయని పేర్కొంది. కమిషనరు ఇచ్చిన నోటీసుకు రెండు వారాల్లో వివరణ ఇవ్వాలని హయగ్రీవ సంస్థకు ఆదేశాలు జారీ చేస్తూ జస్టిస్ సిహెచ్ మానవేంద్రనాథ్‌రాయ్ మంగళవారం ఆదేశించారు. ఆ సంస్థ ఇచ్చే వివరణ ఆధారంగా మూడు వారాల్లో తుది ఉత్తర్వులు జారీ చేయాలని జివిఎంసి కమిషనరుకు ఉత్తర్వులు జారీ చేశారు. యండాడలోని 12.51 ఎకరాల్లో హయగ్రీవా ఫార్మ్స్ అండ్ డెవలపర్స్ నిర్మాణాల్లో లోపాలున్నాయని, వాటి నిర్మాణాలను ఆపేయాలని పేర్కొంటూ కమిషనరు నోటీసులు ఇచ్చారు. దీనిని ఆ సంస్థ సవాల్ చేసిన పిటిషన్‌లో పైవిధంగా ఉత్తర్వులు జారీ చేసిన హైకోర్టు పిటిషన్‌పై విచారణను మూసేసింది.

ఘనంగా విజ్ఞాన శాస్త్ర దినోత్సవం

ప్రజాశక్తి- చింతూరు

మండలంలోని గూడూరు ఆశ్రమ ఉన్నత పాఠశాలలో జాతీయ సైన్స్ దినోత్సవాన్ని పాఠశాల ప్రధానోపాధ్యాయులు సుగాలి సూర్యనారాయణ జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ మూఢ నమ్మకాలను తొలగించుకొని, ప్రస్తుత ఆధునిక సమాజంలో సైన్స్ ప్రాముఖ్యతను తెలుసుకొని నిత్యజీవితంలో ఉపయోగించుకోవాలని సూచించారు. సైన్స్ ఉపాధ్యాయులు చదల కృష్ణారెడ్డి మాట్లాడుతూ సివి.రామన్ జీవిత చరిత్రను రోల్ మోడల్‌గా తీసుకొని ప్రతి విద్యార్థి లిటిల్ సైంటిస్ట్‌గా ఎదగాలన్నారు. ఈ సందర్భంగా సైన్స్ ప్రాజెక్టులు పాఠశాల ఆవరణలో ప్రదర్శించారు. విద్యార్థులకు పాఠశాల హెచ్‌ఎం, సర్పంచ్ బహుమతులు అందజేశారు. గ్రామ పెద్దలు సోడె రామయ్య, మడుగు జోగయ్య తదితరులు పాల్గొన్నారు.

గుర్తేడులో జరిగిన సైన్స్ డే వేడుకల్లో పాల్గొన్న విద్యార్థులు

ఎటపాక : మండల కేంద్రంలోని శ్రీఆదిత్య స్కూల్‌లో జాతీయ సైన్స్ దినోత్సవం సందర్భంగా విద్యార్థులు వివిధ రకాల సైన్స్ నమూనాలను తయారు చేసి ప్రదర్శించారు. ఈ సందర్భంగా పాఠశాల డైరెక్టర్ వెంకట్ మాట్లాడుతూ విద్యార్థి దశ నుండే పిల్లల్లో ఉన్న సృజనాత్మకతను వెలికి తీయడానికి ఈ సైన్స్ ప్రదర్శన ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు. అనంతరం సైన్స్ నమూనాలు తయారు చేసిన విద్యార్థులను, సైన్స్ ఉపాధ్యాయులను ఆయన అభినందించారు.

కొయ్యూరు : మండలంలోని పి.మాకవరం బాలికల ఆశ్రమ పాఠశాలలో ప్రధాన ఉపాధ్యాయులు దేవేశ్వరరావు ఆధ్వర్యంలో సైన్స్ ప్రాజెక్టుల ప్రదర్శన నిర్వహించారు. పిఎస్ ఉపాధ్యాయుని వి.సత్యవతి, ఎన్ఎస్ ఉపాధ్యాయుని ఎస్.కుమారి సర్ సివి.రామన్ గురించి, ఆయన ప్రయోగాలు గురించి వివరించారు. ఈ సందర్భంగా కాంతి ప్రయోగం కూడా చేసి చూపించారు. అనంతరం సివి రామన్ గురించి మాట్లాడిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. సైన్స్ ఉపాధ్యాయులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో స్కూల్ సిబ్బంది పాల్గొన్నారు.

సీలేరు : జీకే వీధి మండలం సీలేరు డిఎవి పాఠశాలలో జాతీయ సైన్స్ డే సందర్భంగా విద్యార్థులు రూపొందించిన వివిధ రకాల ప్రాజెక్టులను ప్రదర్శించారు. ఈ కార్యక్రమాన్ని ఏపీ జెన్కో ఈఈ ప్రభాకర్, ప్రధానోపాధ్యాయులు రామచంద్రరావు జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ వినోద్ బాబు, బాలికల ఆశ్రమ పాఠశాలల్లో ప్రధానోపాధ్యాయులు దేవమణి, విద్యార్థుల తల్లిదండ్రులు ఈ ప్రాజెక్టులను ఆసక్తిగా తిలకించారు. అనంతరం విద్యార్థులు పలు సాంస్కృతి కార్యక్రమాలునిర్వహించారు.

సీలేరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులు వివిధ రూపాల్లో సైన్స్ ప్రాజెక్టులను ప్రదర్శించారు. వీటిని సిఆర్పిఎఫ్ 42 బెటాలియన్ కమాండెంట్ సురేష్ తిలకించి సంతోషాన్ని వ్యక్తం చేశారు. ఈ వైజ్ఞానిక ప్రదర్శన ఎంతగానో ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో స్థానిక పిహెచ్‌సి వైద్యాధికారి సౌమ్య, బాలికల ఆశ్రమం పాఠశాల ప్రధానోపాధ్యాయులు దేవమణి పాల్గొన్నారు.

రాజవొమ్మంగి : స్థానిక జిల్లా పరిషత్ హైస్కూల్, బోర్నగూడెం గిరిజన బాలుర ఆశ్రమ పాఠశాల్లో సివి రామన్ జయంతి సందర్భంగా జాతీయ సైన్స్ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. బోర్నగూడెం పాఠశాలలో విద్యార్థులు వివిధ సైన్స్ ప్రాజెక్టులు ప్రదర్శించారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు మానవ శరీర అవయావల చిత్రాలను రంగు రంగుల ముగ్గులతో చిత్రీకరించారు. ఈ కార్యక్రమంలో ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు పి.శ్రీనివాసరావు, బి ఎజ్రాశాస్త్రి, ఉపాధ్యాయులు బొడారపు కృష్ణ, శ్రీను, సన్యాసమ్మ, కొండబాబు, తదితరులు పాల్గొన్నారు.

మారేడుమిల్లి : వై.రామవరం మండలం గుర్తేడు గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలురు పాఠశాలలో జాతీయ సైన్స్ దినోత్సవాన్ని పురస్కరించుకొని పాఠశాల హెచ్‌ఎం ఎ.సుందర్ సర్ సీవీ రామన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం విద్యార్థులు పలు సైన్స్ ప్రాజెక్ట్ నమూనాలను ప్రదర్శించారు. వాటిలో గెలిపొందిన విద్యార్థులకు బహుమతులను ప్రదానం చేశారు. ఈ కార్యకమంలో పాఠశాల ఉపాధ్యాయులు పి. కిరణ్ కుమార్ రెడ్డి, కె.దనేశ్వర రెడ్డి, కె.రత్నారావు తదితరులు పాల్గొన్నారు.

ఎటపాకలో జరిగిన సైన్స్ డే వేడుకల్లో పాల్గొన్న విద్యార్థులు

స్వాధీనం చేసుకున్న బెల్లం పులుపుతో పోలీసులు

1200 లీటర్ల బెల్లం పులుపు ధ్వంసం

ప్రజాశక్తి-కొయ్యూరు

నాటుసారా నిర్మూలన చర్యల్లో భాగంగా మండలంలోని ఎం.మాకవరం గ్రామ శివారులో నాటుసారా తయారీ స్థావరాలపై కొయ్యూరు పోలీసులు మెరుపు దాడులు నిర్వహించారు. ముందస్తుగా అందిన సమాచారం మేరకు కొయ్యూరు సిఐ స్వామినాయుడు ఆధ్వర్యంలో ఎస్సై రాజారావు, పోలీసులు ఏపీఎస్పీ మహిళా పోలీసులతో కలిసి ఈ దాడులు చేశారు. ఈ సందర్భంగా నాటుసారాకు ఉపయోగించే 1200 లీటర్ల బెల్లం పులుపును, వంట సామాగ్రి, డ్రమ్ములను ధ్వంసం చేశారు. సారా తయారు చేసిన భార్యా భర్తలను నుండి 20 లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకొని, వారిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఎస్సై రాజారావు కేసు దర్యాప్తు చేస్తున్నారు. నాటుసారా తయారీ క్రయవిక్రయాలు చట్ట వ్యతిరేకమని, ఇటువంటి చర్యలకు పాల్పడితే ఉపేక్షించేది లేదని పోలీసులు హెచ్చరించారు.

ఎమ్మెల్యే భాగ్యలక్ష్మిని కలిసిన బాబ్జీ

ప్రజాశక్తి-కొయ్యూరు : వైసిపి అల్లూరి సీతారామరాజు జిల్లా ప్రసార కమిటీ అధ్యక్షులుగా నియమితులైన ధోని బాబ్జీ మంగళవారం ఆ పార్టీ జిల్లా అధ్యక్షులు, పాడేరు ఎమ్మెల్యే కొట్టుగొళ్లి భాగ్యలక్ష్మిని మర్యాద పూర్వకంగా కలిశారు. తనకు పదవి ఇచ్చినందుకు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు. జిల్లాలో పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని ఈ సందర్భంగా బాబ్జి చెప్పారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ అప్పన వెంకటరమణ, మండల సర్పంచ్‌ల ఫోరమ్ అధ్యక్షులు రేగటి ముసిలి నాయుడు, పాడేరు సోషల్ మీడియా కో కన్వీనర్ గాడి అచ్చిరాజు పాల్గొన్నారు.

యువతి అదృశ్యం

ప్రజాశక్తి - సీలేరు : జీకే వీధి మండలం, దేవరకొండ పంచాయతీ, పెట్రాయి గ్రామానికి చెందిన మరిగల శ్రావణి అనే యువతి అదృశ్యమైనట్లు ఎస్ఐ రామకృష్ణ తెలిపారు. శ్రావణి ఈనెల 22 నుండి కనిపించలేదని, వారి కుటుంబ సభ్యులు, బంధువులు విస్తృతంగా గాలింపు చర్యలు చేపట్టిన ఆమె ఆచూకీ లభ్యం కాలేదని, దీంతో సీలేరు పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారని పేర్కొన్నారు. శ్రావణి ఆచూకీ తెలిస్తే స్థానిక పోలీస్ స్టేషన్‌కు గాని, 9440904234, 9440904236 నెంబర్లకు గాని సమాచారం అందించాలని ఎస్ఐ రామకృష్ణ కోరారు.

జీతాలు సకాలంలో అందక ఇబ్బందులు

ప్రజాశక్తి - సీతమ్మధార : ప్రభుత్వ కార్యక్రమాల విజయవంతానికి అహర్నిశలూ కష్టపడుతున్న ఉద్యోగులకు, ఉపాధ్యాయులకు సకాలంలో జీతాలు ఇవ్వకపోవడంతో వారంతా ఇబ్బందులు పడుతున్నారని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు కెఆర్.సూర్యనారాయణ అన్నారు. నగరంలోని ఓ హోటల్‌లో నిర్వహించిన సంఘం జిల్లా కౌన్సిల్ సమావేశానికి ఆయన మంగళవారం ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వ విధానాల వల్ల పెన్షనర్లు, కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు కూడా ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఉద్యోగులు దాచుకున్న పిఎఫ్, ఎపిజిఎల్ఐ, ఎస్ఎల్ వంటి ఆర్థిక ప్రయోజనాలను నెలలు గడుస్తున్నా చెల్లించకపోవడం వల్ల పలువురు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ధరలు విపరీతంగా పెరిగిపోతున్న నేటి పరిస్థితుల్లో డిఎ బకాయిలు పెట్టడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. ఇటీవల ఉద్యోగులపై పనిభారం ఎక్కువైందన్నారు. క్షేత్రస్థాయి ఉద్యోగులకు ముఖ ఆధారిత హాజరు విషయమై అనేక ఇబ్బందులు ఎదురవుతున్నాయని తెలిపారు. సచివాలయ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షులు రమణ, తదితరులు పాల్గొన్నారు.